అందుకు సన్న్యాసి చిన్నగా నవ్వి చెప్పాడు.

"ఓ గది అశుభ్రంగా ఉందనుకో. అప్పుడు నువ్వు దాన్ని సర్దాలనుకుంటావు. ఆ ప్రయత్నం చేస్తే ఏమౌతుంది? ముందు బూజు దులుపుతావు. తర్వాత కింద నేలని శుభ్రంగా ఊడుస్తావు. అప్పుడు కార్పెట్‌లు మురికిగా ఉన్నాయనిపిస్తుంది. వాటిని శుభ్రం చేసి, ఆనక కిటికీ కర్టెన్స్ మాసిపోయాయన్న సంగతిని గమనిస్తావు. వాటినీ మారుస్తావు. ఇంత నీట్‌గా ఉన్న గదిలో కిటికీ కమ్మీలకు అంటిన మురికి స్పష్టంగా నీకు కనిపిస్తుంది. దాంతో దాన్ని శుభ్రం చేయకుండా ఉండలేవు. ఇలా గదిని శుభ్రం చేసేకొద్దీ అపరిశుభ్రంగా ఉన్న ఒకొక్కటే మన కంట పడుతూంటాయి.

"అన్నింటినీ ఎలా శుభ్రం చేస్తూ పోతామో, అలాగే ఓ చెడ్డ అలవాటుని మనం వదిలించుకుంటే, మిగిలిన వాటిమీద కూడా మనం ఆధిక్యతను సంపాదించి, వాటినీ వదిలించుకోవడం తేలికవుతుంది. కాబట్టి ప్రయత్నిస్తే ఎవరైనా సరే ఎంతటి చెడ్డ అలవాట్లనించయినా బయట పడగలరు. అందుకు అవి పేరుకున్న మనసుని శుభ్రం చేయడం మొదటగా ఆరంభించాలి. ప్రయత్నిస్తే నీకదేం అసాధ్యం అయిన విషయం కాదని త్వరలో గ్రహిస్తావు." ప్రోత్సహిస్తూ చెప్పాడు ఆ సన్న్యాసి.

త్వరలోనే సుకుమార్ ఆ సన్న్యాసి మాటల్లో నిజం ఉందని గ్రహించాడు. కొద్ది నెలల తర్వాత అతనిలోని చెడ్డ అలవాట్లన్నీ మటుమాయం అయ్యాయి.

## 66. వెన్నంటే కర్మలు

పూర్వం కృష్ణదాసు, లక్ష్మీపతి అనే ఇద్దరు మిత్రులున్నారు. కృష్ణదాసుకి భక్తి ఎక్కువ. లక్ష్మీపతి జల్సా పురుషుడు. ఓ సారి పక్క గ్రామానికి ఎవరో మహాత్ముడు వచ్చాడని విని, ఆయన్ని చూడటానికి వెళ్తూ కృష్ణదాసు తన

మిత్రుడు లక్ష్మీపతిని తన వెంట రమ్మని కోరాడు. అలాంటి ఆసక్తి లేకపోయినా అయిష్ట క్ష్మీపతి ఆ సత్సంగానికి బయలుదేరాడు.

ఇద్దరూ కొంత వెళ్ళాక దారిలో వారికో అందమైన వేశ్య తారసపడింది. లక్ష్మీపతి ట పడ్డాడు. కృష్ణదాసు మిత్రుడి మనసు మార్చలేక ఒంటరిగానే ఆ డ్ని దర్శించడానికి వెళ్ళాడు. ఆవిధంగా నిత్యం కృష్ణదాసు ఆ మహాత్మ్ డవకుండా దర్శించి ఆయన చెప్పే ప్రవచనాలు వినసాగాడు. లక్ష్మీపతి మాత్రం కృష్ణదాసుతో కలిసి వెళ్ళి, వేశ్య ఇల్లు రాగానే అక్కడ ఆగిపోసాగాడు. ఓ రోజు కృష్ణదాసు లక్ష్మీపతితో చెప్పాడు.

"ఆయన చెప్పే ప్రవచనాలు బావున్నాయి. నువ్వూ వచ్చి విను."

"ఊహు. నాకు ఆ వేశ్య సన్నిధే స్వర్గంలా ఉంది." నిరాకరించాడు లక్ష్మీపతి.

మరి కొద్ది రోజులు గడిచాక ఓ రోజు లక్ష్మీపతి ఎప్పటిలా ఆ వేశ్య ఇంటికి వెళ్ళాడు. ఆమె ఆ ఇల్లు ఖాళీ చేసి వేరే ఊరికి వెళ్ళిపోయిందని తెలిసింది. అతను ఏం చేయాలా అని ఆలోచించాడు. కృష్ణదాసు ఆ మహాత్ముడి గురించి చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. అక్కడకి వెళ్ళి ఆయన చెప్పే ప్రవచనం ఏమిటో విందామనుకున్నాడు.

నడుస్తూ కాలక్షేపానికి విలాసంగా చేతికర్రతో నేలని తాటించ సాగాడు. ఓచోట కర్రకి నేలలో ఏదో ఖంగున తగలడంతో లక్ష్మీపతి ఆసక్తిగా అక్కడ మట్టిని తొలగించి చూస్తే, చిన్న కుండలో నల్లటి బొగ్గుల మధ్య ఓ బంగారు నాణెం కనిపించింది. దాన్ని ఆనందంగా తీసుకున్నాడు. ఈ లోగా మహాత్ముడి దగ్గరకి వెళ్ళే కృష్ణదాసు అతనికి కనపడ్డాడు. లక్ష్మీపతి సత్సంగానికి సంకల్పించడం కృష్ణదాసుకి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇద్దరూ కలిసి నడిచి వెళ్తుంటే కృష్ణదాసు కాల్లో చిన్న ముల్లు గుచ్చుకుని కాలు బాగా వాచింది.

ఆ మహాత్ముడు సత్సంగంలో పాపంచేస్తే కష్టాలు, పుణ్యంచేస్తే సుఖాలు వస్తాయనే విషయాన్ని చెప్పాడు. దాంతో లక్ష్మీపతి కృష్ణదాసుతో ఎద్దేవాగా చెప్పాడు.

"అసలు పాపం, పుణ్యం అంటూ ఏం లేవు. నేను రోజూ వేశ్య దగ్గరకి వెళ్తున్నా, నాకో బంగారు నాణెం లభించింది. నువు రోజూ ఈ సత్సంగానికి వస్తున్నా నీకు కాల్లో ముల్లు గుచ్చుకుంది."

ఆ మాటలు ఆ మహాత్ముడి చెవిలో కూడా పడ్డాయి. ఆయన చిన్నగా నవ్వి లక్ష్మీపతి వంక చూస్తూ చెప్పాడు.

"నీకు తెలిసింది నువ్వు చెప్పావు. నీకు తెలియనిది, నేను చెప్పేది విను. నువ్వు పూర్వ జన్మలో ఓ బంగారు నాణాన్ని ఓ బీదవాడి కూతురి పెళ్ళికై దానం చేసావు. ఆ పుణ్య ఫలంగా ఈ జన్మలో నీకు వంద బంగారు నాణాలు లభించాల్సి ఉంది. కాని నువ్వు గత తొంభైతొమ్మిది రోజులుగా వేశ్య దగ్గరకి వెళ్ళినప్పుడల్లా ఒకో బంగారు నాణెం బొగ్గుగా మారింది. ఆమె గ్రామం విడిచి వెళ్ళిపోవడంతో చివరకి ఒకటే నీకు దక్కింది. ఇక కృష్ణదాసు సంగతి విను. అతను గత జన్మలో రక్షక భటుడిగా ఉద్యోగం చేస్తూ, అనుమానితులని నేరం ఒప్పుకోమని బాగా హింసించేవాడు. ఆ పాప ఫలితంగా ఇవాళ అతని కాలు తెగిపోవాల్సి ఉంది. కాని తొంభై తొమ్మిది రోజులుగా అతను ఈ సత్సంగానికి వస్తున్న పుణ్య విశేషం వల్ల పాపఫలం తగ్గి, చిన్న ముల్లుతో శిక్ష తప్పింది. అందువల్ల దైవచింతన చేయడం మనకే లాభం."

## 67. విగ్రహారాధన

దేవుడికి ఆకారం కాని, నామ రూపాలు కాని ఉండవని రంగాదారి అనేకమంది మహాత్ములు చెప్పగా విని ఉన్నాడు. దాంతో అతను దేవుడికి ఓ గుడి కట్టి, ఓ విగ్రహాన్ని ప్రతిష్టించి 'దేవుడు ఇక్కడ ఉన్నాడు' అని చెప్పడంలో